క్లుప్తంగా

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి



నగదును అందజేస్తున్న టీబీ వీరయ్య

మద్దికెర : దాతల సహాయ సహకారాలతోనే దేవాలయం అభివృద్ధి జరుగుతుందని కార్యనిర్వహణాధికారి వీరయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తూర్పు రాజగోపుర నిర్మాణానికి స్థలం ఇచ్చిన వారికి దాతలు నుంచి సేకరించిన రూ. 4 లక్షలు అందజేశారు. ఇంకా రూ.9 లక్షలు ఇవ్వాల్సి ఉందని దాతల సహకారంతో త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ఇప్పటికే దక్షిణ రాజగోపుర నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. అర్చకులు రంగస్వామి, మాజీ ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఆశీనులైన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి

మద్దికెర : శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం బిందెసేవ,అభి షేకం, అష్టోత్తరనామార్చన, మహామంగళహారతి శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

ఘనంగా మడివాళ మాచదేవ జయంతి



హొళగుందలో నివాళులర్పిస్తున్న రజకులు

హొళగుంద: మండల కేంద్రంలో శనివారం రజక కుల దైవం మడివాళ మాచదేవ జయంతిని నిర్వహించారు. స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయ సమీపంలో నిర్మిస్తున్న నూతన ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాచదేవ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. కురుకంద నాగరాజు, మంగయ్య, ఎల్ఐసీ లక్ష్మన్న, నాగరాజు, కరెంట్ మల్లి, ఎల్లప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐలు

వెల్దుర్తి: కోడుమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్ నగరం గ్రామ సమీపంలో శనివారం కారులో అక్రమంగా తరలిస్తున్న 2,400 టెట్రా ప్యాకెట్లు గల 25 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోడుమూరు ఇన్‌స్పెక్టర్ మంజుల తెలిపారు. కారును సీజ్ చేసి, నిందితులైన కర్ణాటక రాష్ట్రం కడగందొడ్డి గ్రామ కర్ణ గౌడ్, అహమ్మద్ హుసేన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

కృష్ణగిరి: గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కృష్ణగిరి గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను, గ్రామంలో జరుగుతున్న పశువుల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. పశువుల షెడ్లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.

చంద్రబాబుది దిగజారుడు రాజకీయం

ఆలూరు: సీఎం చంద్రబాబునాయుడుది దిగజారుడు రాజకీయమని ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ విమర్శించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా లోటు బడ్జెట్ పేరుతో తప్పించుకునేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు.

జయప్రదం చేయండి

పత్తికొండ రూరల్ : ఈనెల 7వ తేదీన హైదరాబాదులో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగే 'లక్షల డప్పులు– వేల గొంతులు' కార్యక్రమాన్ని మాదిగలందరూ సంఘటితంగా జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు సుభాష్‌చంద్ర, తిరుపాల్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆలూరు: హక్కుల సాధనకు ఉద్యమించక తప్పదని ఈనెల 7వ తేదీన హైదారాబాద్‌లో లక్ష డప్పులు..వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.జె ప్రకాష్ మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం రాయలసీమ జిల్లాల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఫీజు పోరును విజయవంతం చేద్దాం

- ఈనెల 5న కర్నూలులో కార్యక్రమం
- ప్రభుత్వ మెడలు వంచి పేదల చదువుకు తోడుగా నిలుద్దాం
- ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి

వెల్దుర్తి: ఫీజు బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం పేదలను చదువుకు దూరం చేస్తోందని, పేదలకు తోడుగా నిలిచేలా, ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు వెంటనే చెల్లించేలా కర్నూలులో ఈనెల 5న చేపట్టిన ‹వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు›లో పాల్గొని విజయవంతం చేద్దామని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం కర్నూలులోని తన స్వగృహంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, పలువురు పార్టీ ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. శ్రీదేవి మాట్లాడుతూ ఫీజు పోరు కార్యక్రమం కర్నూలు రాజ్ విహార్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పేదల చదువుకు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యం ఇచ్చి ఎన్నో పథకాలతో నాణ్యమైన విద్యను అందించిందని గుర్తు చేశారు. నేటి ప్రభుత్వం కార్పొరేట్‌కు కొమ్ముకాసేలా పేదలకు నాణ్యమైన చదువును దూరం చేస్తూ, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటి వరకు బకాయిలు చెల్లించకపోవడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. ప్రభుత్వ మెడలు వంచేందుకు చేపట్టిన వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు› కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గంలోని యువజన, విద్యార్థి విభాగం నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేశ్, తుగ్గలి, కృష్ణగిరి మండలాధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఆర్‌బీ వెంకట్రాముడు, ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాంపల్లె వెంకట్రాముడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు



హొళగుంద పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్

హొళగుంద: గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌కు సూచించారు. శనివారం హొళగుంద పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ఆమె అనంతరం పంచాయతీ ఆదాయం ఇతర అంశాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అలాగే ఈఓపీఆర్డీ చక్రవర్తి, పంచాయతీ సెక్రటరీతో కలిసి పంచాయతీ ఆదాయం, సిబ్బంది పనితీరు ఇతర విషయాలపై చర్చించారు. గ్రామంలో దోమలు, వ్యాధుల నివారణకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దోమల నివారణకు యాంటీ మలేరియా మందులను స్ప్రే చేయడం, ఫాగింగ్ ఇతర కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా, పైప్‌లైన్ లీకేజీలు, బోర్లు, చేతిపంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. కొర్రేవంక, ఈర్లకట్ట, దిడ్డి కాలనీ తదితర ఏరియాల పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో 2024–25 సంవత్సరానికి సంబంధించి రూ.4.78 కోట్లు పనులు రావాల్సి ఉందని ఇందులో రూ.51.34 లక్షలు మొండి బకాయిలు ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.69 లక్షలు వసూలయ్యాయని వివరించారు.

అంకితభావంతోనే గుర్తింపు

మద్దికెర : అంకిత భావంతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు లభిస్తుందని సర్పంచ్ మల్లికార్జున, ఈఓ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో వీఏఏగా విధులు నిర్వహిస్తున్న ఇంద్రజకు ఉత్తమ అధికారిగా ఎంపికై అవార్డు తీసుకున్నందుకు సన్మానించాశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి వున్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోండి

హొళగుంద: 2024–25 సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కమ్మ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాల కోసం సబ్సిడీ రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయలలిత ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారం, సేవలు, ట్రాన్స్‌పోర్ట్ తదితర వాటికి సంబంధించిన యూనిట్లకు సబ్సిడీ రుణాలు ఇస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21–60 ఏళ్ల లోపు ఉండాలని, కాపు వారికి 21 0 50 ఏళ్ల లోపు ఉండాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తప్పనిసరిన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 7వ తేదీ లోపు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక పూజలు



కూర్మనారాయణ స్వామి

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూర్మనారయణస్వామి, హనుమన్నస్వామికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలి

కృష్ణగిరి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సైనికునిల్లా పని చేయాలని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ రాయలసీమ కన్వీనర్ పులివెందుల సతీష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం కర్నూలులోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశం అనంతరం జిల్లా, మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకారంలో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీ పదవులు పొందిన వారందరూ గ్రామస్థాయిలో కార్యకర్త, నాయకుల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా అధికార ప్రతినిధిగా లక్ష్మీనగరం గ్రామానికి చెందిన దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా జి. ఎర్రగుడి జిట్టా నాగేష్‌యాదవ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మద్రిమాను తండా భాస్కర్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మద్దికేర వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీలుగా కటారుకొండ నగిరి మాధవరావు, పత్తికొండ పల్లె ప్రతాప్‌రెడ్డి, హోసూరు మోహన్‌కృష్ణ, అలాగే కృష్ణగిరి మండల పార్టీ కన్వీనర్ ఆలంకొండ ఆర్‌బీ వెంకటరాముడు, వెల్దుర్తి మండల కన్వీనర్‌గా వెల్దుర్తికి చెందిన బొమ్మన రవీందర్‌రెడ్డి (రవిరెడ్డి), పత్తికొండ మండల కన్వీనర్‌గా పందికోన కారం నాగరాజు, తుగ్గలి మండల కన్వీనర్‌గా పెండేకల్ అట్లా గోపాల్‌రెడ్డి, మద్దికెర మండల కన్వీనర్‌గా మల్లికార్జునయాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



యాటకల్లులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ రామకృష్ణ

ఆస్పరి: వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రామకృష్ణ కూలీలకు సూచించారు. శనివారం మండలంలోని యాటకల్లు, తొగలుగల్లు గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను పరిశీలించి కూలీల మస్టర్లును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొలతలు ప్రకారం పని చేస్తే రోజుకు రూ. 290 నుంచి రూ. 300 వరకు వేతనం పడుతుందన్నారు. మండలంలో 1,600 మంది కూలీలు పనులకు వస్తున్నారన్నారు. అడిగిన వారందరికి ఉపాధి పనులు కలిప్తస్తామని చెప్పారు. కొత్తగా జాబ్ కార్డు కావాల్సిన వారు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్సును ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శికి అందజేస్తే వెంటనే ఇస్తామని చెప్పారు. టీఏ రాజేంద్ర ఉన్నారు.

మైదానం సమస్య పరిష్కారానికి చర్యలు

దేవనకొండ: స్థానిక మెయిన్ హైస్కూల్‌లో పాఠశాల గ్రౌండ్ ఏర్పాటుకు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన దేవనకొండలో పర్యటించారు. ఈ మేరకు తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పలు సమస్యలను శాప్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలుగు యువత అధ్యక్షుడు రాజాసాహెబ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దయ్య, ఉప సర్పంచ్ సుభాన్, ఐటీడీపీ తాలూకా అధ్యక్షుడు రామంజి తదితరులు పాల్గొన్నారు.

10న ఆలూరులో విగ్రహ ప్రతిష్ఠ

ఆలూరు: ఈనెల 10వ తేదీన స్థానిక కోటవీధిలో శ్రీ దేవమ్మవ్వ నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం చేపట్టనున్నట్లు వీరశైవలింగాయతీ సంఘ పెద్దలు చంద్రశేఖరయ్య స్వామి, ఎం.శివరుద్రయ్యస్వామి, జగదీశ్వరయ్యస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బల్లూరులో 5న కుంభోత్సవం

హాలహర్వి: మండలంలోని బల్లూరు గ్రామంలో కొలువైన దేవమ్మ, సుంకులమ్మ ఆలయాల్లో ఈనెల 4వ తేదీన గంగపూజ, 5వ తేదీన కుంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామపెద్దలు శనివారం తెలిపారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుగ్గలి: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక గత నెల 24న మండల పరిధిలోని ఎల్లమ్మ గుట్టతండాకి చెందిన శంకర్‌నాయక్ (50) పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుడు ఉన్న మూడు ఎకరాలతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు జొన్నగిరి ఎస్ఐ జయశంకర్ తెలిపారు.

చెత్త నిల్వవుండకుండా చర్యలు

మద్దికెర : గ్రామంలో చెత్త నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని ఈఓ శివకుమార్ అన్నారు. శనివారం గ్రామంలోని జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

గ్రామాలకు సాగు, తాగునీరు ఇవ్వాలి

పత్తికొండ రూరల్ : మండలంలోని అన్ని గ్రామాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. శనివారం పత్తికొండకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. మండలం మీదుగా వెళ్తున్న హంద్రీనీవా కాలువ ద్వారా 5శాతం ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు కేటాయించేలా ఒప్పందం జరిగిందన్నారు. ఈ మేరకు స్టోరేజీ ట్యాంకులు ఏర్పాటుచేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.పట్టణ ప్రధాన రోడ్డు వెడల్పు చేయాలని, హోసూరు పెద్దహుల్తి గ్రామానికి రోడ్డు వేయాలని, హోసూరు దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేసి సాగునీటిని అందించాలని కోరారు. నాయకులు రంగారెడ్డి, దస్తగిరి ఉన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి



కొండను తవ్వి భారీగా నిల్వ చేసిన గ్రానైట్ బ్లాక్‌లను చూపుతున్న సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ

వెల్దుర్తి: ప్రకృతి సంపదను అనుమతులు లేకుండా తవ్వి తీస్తూ అక్రమార్జనకు తెరతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి టి. కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని నర్సాపురం గ్రామ సమీపంలో కొండను తవ్వి గ్రానైట్ రాయిని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారీ స్థాయిలో అక్రమ మైనింగ్ జరుగుతోందని, ఈ విషయంపై ఇటు మైనింగ్, అటు రెవెన్యూ అధికారులు ఏమీ తెలియనట్లు నటిస్తుండడం విడ్డూరమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పర్యావరణాన్ని కాపాడండి

వెల్దుర్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హెచ్ఎం రమణ, గ్రామపెద్దలు వీరభద్రుడు, బాలమిన్నెల్ల పిలుపునిచ్చారు. మండలంలోని అమకతాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వారు వెల్దుర్తి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. భగవాన్ సత్యసాయిబాబా జయంతి సందర్భంగా పాఠశాలలో 40 మొక్కలు నాటినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయులు అమీర్‌బాషా, సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రంజిత్ బాషా

పత్తికొండ రూరల్ : క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. శనివారం పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి సౌత్ ఇండియా లెవెల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో ప్రతి క్రీడాకారుడు ఉత్తమ ప్రతిభ కనపరచాలని సూచించారు. ఇంత పెద్ద ఎత్తున టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు ఎద్దులదొడ్డి శ్రీనివాసులు, కందనాతి సుంకన్నను అభినందించారు. పత్తికొండ టీం–5, కర్నూలు రాయల్ లెవన్స్ టీంల మధ్యన మొదటి మ్యాచ్ ప్రారంభమైంది. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీఓ భరత్‌నాయక్, శాప్ చైర్మన్ రవినాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

8న అంతర్రాష్ట్ర గిరక బండి పోటీలు

కృష్ణగిరి: మండలంలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్యస్వామి ఉరుసును పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన అంతర్రాష్ట్ర కిలారి దేశపు (తూర్పునాటి) ఎద్దులకు మాత్రమే గిరక బండి పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ఉదయం 7 గంటల్లోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.3వేలు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 9502552533, 7993413145 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు..

ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 8న అంతర్రాష్ట్ర హోమ్ టీం కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 9666292339, 9177257589, 8008665793 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సూపర్ సిక్స్ ఎక్కడ బాబూ?



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్

ఆలూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి ప్రజల జీవితాలను మార్చుతామని ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన ఏడు నెలలు గడిచినా పథకాల అమలు ఊసేది.. కనీసం ఒక్కటైన అమలు చేసి ప్రజలకు సాయం చేశారా అని సభ్యులు ప్రశ్నించారు. లోటు బడ్జెట్ పేరుతో హామీలను అటకెక్కించారని ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తుంభళబీడు, పెద్దహోతూరు గ్రామాలకు చెందిన టీడీపీకి చెందిన ఎంపీటీలు రమేష్, చిన్న తిక్కయ్య మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పక్కగృహాలను గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వారికి హౌసింగ్ ద్వారా గృహాలను మంజూరు చేస్తున్నామని ప్రకటిస్తే సంబంధిత రెవెన్యూ అధికారులు స్థలానికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు మంజూరు చేయడం లేదని వైస్ ఎంపీపీ శ్రీరాములు, దేవరాజ్ సభ దృష్టికి తెచ్చారు. ఆర్ఐ బసన్నగౌడు మాట్లాడుతూ గతంలో ఒక రేషన్ కార్డుపై ఆ ఇంట్లో ఎవరికైనా ఇల్లు మంజూరైతే తిరిగి ఆ కార్డుపై మరొకొరికి ఇల్లు మంజూరు కాదన్నారు. ఎంపీడీఓ మహబూబ్‌బాషా, ఈఓపీఆర్డీ వై.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పడిగాపుల పింఛన్!



చెన్నంపల్లిలో లబ్ధిదారు ఫేస్ రికగ్నిషన్ తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

తుగ్గలి : సామాజిక పింఛన్ల కోసం లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. ప్రతి నెల ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. శనివారం ఉదయమే అధికారులు పింఛన్ల పంపిణీకి గ్రామాలకు వెళ్లినా రెండు, మూడు గంటల పాటు సర్వర్ పని చేయలేదు. అటు పంపిణీ అధికారులు, లబ్ధిదారులు ఇక్కట్లు పడ్డారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు గ్రామాల్లో పింఛన్ సొమ్ము కోసం కార్యాలయాల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. అమినాబాద్‌లో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు ఊరి చివర పడిగాపులు కాయాల్సి వచ్చింది. గతంలో ఉదయం 7గంటల్లోపే అందేదని, నేడు మాత్రం గంటల కొద్దీ ఎదురు చూడాల్సి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బు అందించే వలంటీర్ నేడు లేకపోవడంతో.. కార్యాలయాలు, పంచాయతీ కట్టలు, ముఖ్య కూడళ్ల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని లబ్ధిదారులు వాపోయారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామ బీసీ కాలనీలో ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను రెన్యూ వినిగ్ పవర్ సంస్థ ఏర్పాటు చేయగా.. సర్పంచ్ మోహన్‌రాజ్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వేగవంతమవుతుందని చెప్పారు. దీంతో ప్రజలకు సమస్యలు పరిష్కారమవడంతో పాటు అభివృద్ధి త్వరగా చెందడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పెద్దలు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

గురుశిష్యుల బంధానికి ప్రతీక

- నేడు బొమ్మిరెడ్డిపల్లె పామయ్యతాత తిరుణాల
- నార్లాపురం, బొమ్మిరెడ్డిపల్లె గ్రామాల మధ్య కొనసాగుతున్న ఆధ్యాత్మిక అనుబంధం
- రేపు బండలాగుడు పోటీలు



పక్కపక్కనే సమాధి అయిన గురుశిష్యులు పామయ్యతాత, హనుమంతయ్య ఆలయాలు



పామయ్యతాత సమాధి

వెల్దుర్తి: గురుశిష్యుల బంధానికి ప్రతీకగా నిలుస్తున్నారు.. బొమ్మిరెడ్డిపల్లె పామయ్యతాత, నార్లపురం రైతు హనుమంతయ్య. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పామయ్య తాత తిరుణాల ఆదివారం ప్రారంభమై రెండు రోజులపాటు నిర్వహించనున్నారు.. అవధూత లద్దగిరి పెద్దరాందాసు అంశగా పిలవబడే బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన పామయ్య తాత వర్ధంతి సందర్భంగా ఏటా అదేరోజున తిరుణాల జరుపుకుంటారు. నార్లాపురం గ్రామం పెనికలపాటి వంశీయులు ఎడ్లబండ్ల ద్వారా తీసుకొచ్చే తొలి నైవేద్యంతో, తాత వారసులైన బొమ్మిరెడ్డిపల్లె వాసులు అర్చకులై చేసే పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయి.

రెండు గ్రామాల అనుబంధానికి ప్రతీక..

పామయ్య తిరుణాల గురుశిష్యుల బంధానికి, నార్లాపురం, బొమ్మిరెడ్డిపల్లె గ్రామస్తుల మధ్య ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీకగా ఉత్సవాలు సాగుతాయి. శతాబ్దం క్రితం బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన గొల్ల పామయ్య గొర్రెల కాపరి. నార్లాపురం రైతు పెనికలపాటి హనుమంతయ్య సైతం గొర్రెల కాపరిగా పామయ్యతోపాటు వెళ్లేవాడు. ప్రతిరోజు పామయ్య తాతకు తన ఇంటి వద్ద నుంచే సద్ది (భోజనం) తీసుకువచ్చేవాడు. పామయ్య తాత మహిమల పుణ్యమా అని హనుమంతయ్య ఇంట్లో వరిధాన్యం అయిపోగానే తిరిగి కుప్పగా కనిపించేవి. పామయ్య తాత తన చేతి స్పర్శతో పశువుల గాయాలను నయం చేసేవాడు. కరువు కాలంలోనూ ఎక్కడ పడితే అక్కడ చిన్న గుంత తీసి దోసిళ్లతో నీరు తాపేవాడు. వరదలు వచ్చిన సందర్భంలోనూ గొర్రెలు కాసేందుకు, సద్ది తీసుకెళ్లే హనుమంతయ్యకు ఎలాంటి ఆవాంతరాలు లేకుండా చూసేవాడు. ఇలాంటి మహిమలను కన్న హనుమంతయ్య, పామయ్య తాత శిష్యుడిగా మారి అతని సేవలో తరించాడు. శిష్యుడి సేవలను గుర్తించిన గురువు పామయ్యతాత తన మహిమతో శిష్యునికి వజ్రపు ఉంగరం ఇచ్చినా సున్నితంగా తిరస్కరించాడు. పామయ్యతాత కాలం చెంది బొమ్మిరెడ్డిపల్లె సమీపా న సమాధి అయ్యారు. యధావిధిగానే.. తాత వర్ధంతి నాడు కూడా తాత సమాధి వద్ద తొలి నైవేద్యం పెడుతూ వచ్చాడు హనుమంతయ్య. తాత సమాధికి గుడి నిర్మాణానికి బొమ్మిరెడ్డిపల్లె వాసుల సహకారంతో పూనుకున్నాడు. గుడి నిర్మాణ దశలో నాటి బ్రిటీష్ కలెక్టర్ అడ్డుపడగా.. అనారోగ్యం పాలై తాత మహిమను చూసి నిర్మాణానికి సహకరించినట్లు స్థానిక పురాణం పేర్కొంటోంది. 1930లో హనుమంతయ్య పరమపదించగా పామయ్యతాత సమాధి గుడి పక్కనే శిష్యుడి సమాధిని నిర్మించారు. పామయ్యతాత గుడి నిర్వహణకు హనుమంతయ్య వంశీయులు సొంత పొలం రెండెకరాలు కేటాయించి, హనుమంతయ్యకు సైతం గుడి నిర్మించారు. పా మయ్యతాత తిరుణాల నాడు గురుశిష్యుల సమాధుల వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. శిష్యుడైన పెనికలపాటి హనుమంతయ్య పద్ధతి మేరకు ఆయన వంశీయులు ఇప్పటికీ తిరుణాలరోజు ఎద్దుల బండ్లపై తమ తొలి నైవేద్యం బొమ్మిరెడ్డిపల్లె పామయ్య తాత సమాధికి సమర్పించడం ఆనవాయితీ.

రేపు బండలాగుడు పోటీలు

ఈనెల 3వ తేదీన న్యూ కేటగిరి విభాగంలో అఖిల భారత ఒంగోలు జాతి కోడెలకు బండలాగుడు పోటీలు మాజీ ఎంపీపీ శైలజా సుబ్బరాయుడు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్ 7981820071, 9502188282 నంబర్లలో సంప్రదించాలని కోరారు.